# మార్నాల పండగ

రేత్తిరి అంత లెక్క పొద్దుపోయినా దురగప్ప కుమ్మరి గుడిసెలో ఆయిదం పెవిఁతె యింకా అట్టనే కాల్తా వుంది.

రఁయ్ రఁయ్ మంటా గిర్గిరా తిరిగే కుమ్మరిసాన కుయ్‌కుయ్ఁన కూత లేత్తా తిరగటంలా. సురసురా కుమ్మరిసానను గిరగిరా, సల్లసల్లటి బంకమట్టిని తవ్ తవ్, సానపెట్టిన సన్న సేతులు లోపలంటా, పొట్టమీన, మెడలకాడా, తలల సుట్టూ సరిది సరిది, ఒక వొరసగా కుండలన్నిటీన్నీ కుదురుగా తీర్చటంలా.

కుమ్మరిసానకు సరసనే కుమ్మరి దురగప్ప కూకుని, నీలలో తడిపి వుండ బంకమట్టి కల్లి నిలకడగా సూత్తా, ఆలోసెన్లో పడ్డాడు ఎప్పట్నించో.

తెల్లారిందంటే – మార్నాల పండగ.

“అలిగి పుట్టింటికి–లగెత్తుకెల్లింది పెల్లాం తిరుపతమ్మ. పండగకి ఒచ్చే మడిసైతే యీయాల కెప్పుడో రాల్చిందేగా! యింకేం ఒచ్చుద్దీ! తనమీన అలిగింది. తెల్చే తెలవకో నిందలాడిందే అనుకో. తను ఎదవగా బుద్ధి తక్కువ పని జేసింది కూడా తప్పేగా! ముంగల తప్పు తప్పే. బతివిఁలాడి తీసుకురాటానికి దానంతట అది రాదని తెల్చికూడా తను ఎల్లలా! తనూ బిగదీసి కూకుండాడు. ఎందుకనీ? ఒకిదంగా ముంగల తప్పు తనకాడుండా, అంతకి మిగులుగానే తన్ను ఎదవకన్నా కనాకట్టంగా–యీనంగా కట్టేసింది. పెల్లాం ఒచ్చినాల్టినించీ తను తాగుడు మానుకుండాడు. ఎంత కట్టమ్మీన మానిందీ దానికి తెల్దా? పెల్లామ్మీ నుండే బెమతేగా తన్నిట్టా జేసిందీ? మరి యింత యవారం జరిగితే అదేవన్నా సూడగలిగిందా? లేదు. మరి యాల బాగుండకనే ఆ రోజున ఒకల్లిద్దరి బలంతమ్మీన ఒల్లు తెలవకుండా తెగదాగి యింటికొచ్చాడు తను.

“నువు తాగి ఎగిర్నా. యిట్టాటి సెందాలప్పన్లకు పాల్బడ్తావని నే నెప్పుడూ అనుకోలా!” అంది.

అంత పొద్దుపోయినా తనకోసం కాసుక్కూకోటానికి కారనం వుండే సేసింది.

తనేం మాటాడలా.

"ఆడకూతురు సొమ్మెత్తికెల్లి తాగుడుకు బోసే మొగాళ్ళతో ఏ ఆడది మటుకు పెల్లావుఁకు మల్లే వుంటదీ? నా కాసుల్దండ ఏం జేశా?"

"నువు మాట్టాడేదేందో నాకు తెలవదు. నేనయితే బుద్ధిపూర్వకంగా తాగాలని మటుకు తాగలా. అది నీకు తెల్చిన యిసయవేఁ!" వుండ యవారవేందో సెప్పాడు తను.

"తాగుబోతు మడుసులకు కూసేదీ సేసేదీ ఎట్టా తెల్చుద్దీ? నీ తాగుడూ తందనాలకుగాను యీడేం దండలు కట్టు క్కోలా! మా అమ్మ పెట్టిన దండ నాకొక్కటే. అది యియ్యాల నీ పాల్ట పడ్డది. యింత దురమారగం జరుగుద్దని నాకు మటుకేం తెల్చుద్దీ?"

"యిదిగో, నువు దండలు గిండ లంటున్నావు. నీ దండల్తో ఏ ఎదవకేం పని పట్టలా. మాటలు మటుకు జార్నీమాక!"

"ఆడ గూతురు యిట్టాటి పన్లెప్పుడూ సెయదు. నువు అంతకన్నా ముదినష్టకం. ఆ మొగాలు అప్పుడే తెలుత్తయి!"

"తెలుత్తయిగానీ, నీకు మల్లే కరువుకు సచ్చే యిడింబి రకానికి సేసినా తప్పులా–
"

"నువో? గటోత్కచుడి ముత్తాత కొడుకు రాచ్చసుడివి! మడుసుల్లో యిట్టాటోళ్ళు మాకెప్పుడూ తగల్లా! యియ్యాల్టికి నువు జతపడ్డావు. కాసుల్దండ ఎత్తికెల్లి తాగొచ్చావంటం దేనికీ? తెల్లారి నా మెడిరగదీసి నవిఁలి మింగవంటా? యిట్టాటి మొగడు దొరక్కబోతాడనే ఎన్నో దండాలు పెట్టుకుండా నాగారు బొమ్మ తల్లికి. యియ్యాల్టికి నీ పున్నె వాఁ అంటా గెట్టు తెగి నేను తడుత్తుండది, యిగ సాల్దా? నా కాసులన్నీ నువే అరాయించుకు బతుకుఁ –" పెడీల్మని తలుపు మొగానగొట్టి ఎల్లింది యాడికో.

అసలు జరిగిందేందో మరసనాటిగ్గాని తనకు వయనంగా తెలవలా.

కాసుల్దండ యాడో పారేసుకుని ఒల్లు తెలవకుండా ఎత్తిబోసి–లగెత్తుకెల్లింది! అమ్మకాడ కూకుని సాదించాల గావాల్ను! ఒకేల తను తాగుండాడే అనుకో, తాగుండాడ్తో ఆడగూతురు అట్టనేనా సెయ్యాల్చిందీ? కాసుల్దండ కతేవఁయిందో ఆ భగమంతుడికే తెలవాలగానీ, తనుమటుకు అన్ని మాటలుపడి ఎల్లి బతివిఁలాడి తీసుకొచ్చుకోను రోసం వుండక్కర్లా?–తెల్లార్తే పండగ. ఎట్టనబ్బా? పానీ, పండగ సాకుతో నన్నా ఒత్తే ఎవురేవంటారూ–యిగ నేం ఒచ్చుద్దీ? పండగ పూట ఎట్టనబ్బా ఒంటిగా–ఆ బగమంతుడే వుండాడు అన్నిటికీ – లెగిసి, తడిపి పెట్టిన బంకమట్టిని ముద్దలు సేత్తా వుండాడు దురగప్ప, సే సేది ఎట్టా ఏదయిందీ తెలవకుండా.

అమ్మ యింటో తిరుపతమ్మ–

"తెల్లార్తే పండగే? ఇగ నేం వత్తాడూ? ఎవురేఁవన్నారనీ ఇన్నాల్దాకా నన్నీడ కూకోబెట్టడం? నిన్ను సూత్తే నాకెంతో ఇట్టవేఁ! అని ఎట్టాటి సనువుఁతో మురిపిచ్చేవోడూ? అంత యిట్టంగుండేవా దెవుడూ యింతకాలం బాదపెట్టడు, ఏ ఆడగూతుర్నీ. ఏది ఎట్టాటిదయిందీ నాకేం తెలవదుగందా! పానీ, కాసుల్దండ కావాలంటే నేనేం కాదంటానా?– అట్టాటి సాటుపన్లు దేనికీ? అంత లావు తాగుడు తాక్కబోతే సత్తారా జనం? ఎంతో మనసుమీన కాసుల్దండ సేపిచ్చింది నాకు మామ్మ. అమ్మకు తెలుత్తే? వూల్లోవోరంతా తిరపతమ్మ మొగుడు, పెల్లాం కాసులమ్ముకుని తాగుతుండాడని పులి[త్రాకులు కట్టే దెవురికీ? ఎట్టాటి అల్లుణ్ణి సంపాయించిందే, ఏనాడో సేసుకోవాలగాని! అని పొరుగిళ్ళోరంటుంటే, మురిసిన మురవటానికి అమ్మ కెట్టుంటదీ? కచ్చని కాకబోతే ఎవుర్ని సాదియనూ యీడకు లగెత్తు కొచ్చిందీ? ఎట్టనో ఇప్పటిదాకా గుట్టుగా వుండదిగాని, తెల్లారి పండగ నాడు అల్లుడేదని ఆరీరు అడగరూ? కాసులు ఎత్తికెల్లాడని రగిలి ఏమ్మాటలన్నానో! మొదులు ముంగల తనెందుకు తాగి రావాలా? ఇడింబని నన్నెందుకనాలా? మామ్మ పెట్టిన సొమ్ము మీన తనకేం అక్కుండదీ? అక్కుండా అమ్ముకుని తాగమన్నారా? సాటుసాట్న తాగుతుండ మద్చికి యింత కరుజుగ్గాను దబ్బు యాణ్ణుంచి ఒత్తుండట్టో? సేసిన అప్పంతా తీరవక్కర్లా మరీ! ఎప్పుడో తెలవకుండా తీసుకుని–ఎప్పుడో దేనికీ? అంతక్కిందటి దినం మట్టి గలిపి తలకు పోసుకోబోత, లోన గూట్లో లక్కపిడతలో దండ దాయలా? యిగ నేం సందు అగుపిత్తుంటే? ఈ పకారం తిరుగుతుంటే, ఏ ఆడకూతురూ ఎట్ట బరిచ్చుద్దీ? ఇడింబినంట! మల్లీ తిరిగి అ[న్రాంటే అనరూ? నాకు మటు కేం పట్టిందీ! నేనీడే కూకుంటా. యవారం ఎట్టొచ్చుద్దో సూత్తాగా. అయ్యో! ఎంత బెవఁ, నేనంటే! నంగనాసి!–"

దబదబ తలుపు కొడ్తుండా రెవురో. "పానం దీసి రాలేదుగందా–అమ్మ యాడికిబోయిందో–ఎట నబ్బా–" ఎల్లి సల్లగా తలుపు తెరిసేతలికి–గబాల్న తలుపు యిరగదోసుకుంటా ఒచ్చి ముంగల నిలబడ్డాడు రొప్పుతా–సెర్లో తెప్ప మునిగినట్టు, కాళ్ళు బావిఁలోకి గుంజుకబోతుండయి తిరపతమ్మకు.

"యిదుగో నీ కాసులు! బంకమట్టిలో బ[దంగా తడిబ్బెట్టుకుండావు. పాపం, కాసులు కాసులంటా కలవరిత్తా ఎంత సిక్కిబొయ్యావ్? తాడు దెగి మట్టిలో ఓటోటిగా పడుండయి నీ ధర్మమంటా!"

దిమ్మరబోయి నిలబడ్డది తిరపతమ్మ కళ్ళార్పుకుంటా.